క్లుప్తంగా

రూ.50 లక్షలతో పబ్లిక్ హెల్త్ యూనిట్



హెల్త్ యూనిట్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మెంటాడ: మండలంలోని చల్లపేట ఆస్పత్రి ఆవరణలో పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు సోమవారం భూమిపూజ చేశారు. ఏపీ(ఆంధ్రప్రదేశ్) వైద్య విధాన పరిషత్ నుంచి మంజూరైన రూ.50 లక్షల నిధులతో చేపడుతున్న ఈ నిర్మాణంలో ఆరోగ్య తనిఖీలతో పాటు మెడికల్ టెస్ట్‌లు కూడా చేయడం జరుగుతుంది. ఫిబ్రవరి నాటికి నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత చప్ప మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

మెంటాడకు ట్రైనీ కలెక్టర్



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మెంటాడ: ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ సోమవారం మెంటాడకు విచ్చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ విధులకు సంబంధించి, పూర్తిస్థాయి శిక్షణ పొందేందుకు నెల రోజుల పాటు ఇక్కడే ఉంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత తహసీల్దార్ రామకృష్ణతో పాటు తాను కూడా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు.

ఉపాధ్యాయుడి మృతి



చిన్నంనాయుడు(ఫైల్)

రామభద్రపురం: మండలంలోని మామిడివలసకు చెందిన ఉపాధ్యాయుడు ఆకుల చిన్నంనాయుడు(55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి రోజంతా వరి చేను పనుల్లో నిమగ్నమయ్యారు. అదేరోజు రాత్రి 8 గంటల సమయంలో శరీరమంతా దద్దుర్లు పుట్టి, మంటగా అనిపించడంతో రాత్రి 10 గంటలకు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ రాత్రి 12.30 గంటలకు ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డీఎస్సీ–1998లో ఇతడికి టీచర్ ఉద్యోగం రాగా, ప్రస్తుతం మండలంలోని జుమ్మువలస గిరిజన గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గతంలో మామిడివలస పంచాయతీ సర్పంచ్‌గా ఈయన పనిచేశాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కొండగూడేంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ వెంకటప్పలనాయుడు

సంతకవిటి: మండలంలోని కొండగూడేం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కెంబూరు వెంకటప్పలనాయుడు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతీ ఇంటికి వెళ్లి, వివరించాలని తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీ ఔదార్యం



స్వెట్టర్లు అందజేస్తున్న ఏసీ చిరంజీవి

రేగిడి: విజయనగరం జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ రాహుల్ సౌరభ్ నిత్యాన్నదాన సత్రంలోని పేదలకు స్వెట్టర్లు వితరణ చేశారు. వీటిని వెలుగు ఏసీ ఎ.చిరంజీవి, ఏపీఎం గోవిందరావు కలిసి సోమవారం వావిలవలస వెళ్లి, సత్రం నిర్వాహకులకు అందజేశారు.

కాలినడకన కోటేశ్వరాలయానికి భక్తులు



రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామం నుంచి 150 మంది శివస్వాములు శ్రీకాకుళంలోని పంచలింగాలలో ఒకటైన కోటేశ్వరాలయానికి కాలినడకన సోమవారం బయలుదేరారు. లోక కల్యాణార్థం తామంతా ఈ పాదయాత్ర చేపడుతున్నామని గురుస్వామి వెంకటరమణ తెలిపారు. కార్తీకమాస మూడో సోమవారం సందర్భంగా ఈ పాదయాత్ర చేపట్టామన్నారు.

శివోహం..!



వంగర: సంగాంలో దైవదర్శనానికి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

కార్తీక సోమవారం పురస్కరించుకుని, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని, దైవదర్శనం చేసుకున్నారు. ప్రత్యేకాభిషేకాలు, పూజలు, దీపారాధనలు నిర్వహించారు. మరోవైపు భక్తుల ఓం శివోహం, హర హరమహాదేవ నినాదాలతో శివనామస్మరణ మార్మోగింది. వాడవాడలా జరిగిన ఈ కార్యక్రమంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. – సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: అలజంగి కాశీవిశ్వేశ్వరాలయంలో మహిళల దీపారాధన



సంతకవిటి: ఎస్.రంగారాయపురంలో ఈశ్వర నారాయణ ఆలయంలో పూజలు



తెర్లాం: కొరటాం శివాలయంలో పూజలు



వంగర: సంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు



బాడంగి: పాల్తేరు శివాలయంలో దైవదర్శనం కోసం వేచి చూస్తున్న భక్తులు



రామభద్రపురం: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రాజాం: మల్లికార్జునస్వామి ఆలయంలో నాగదేవుడికి పూజలు

ప్రతిఇంటా 'సంక్షేమ' సంతోషం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు విరివిగా అందిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తుండడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. మరోవైపు ప్రతీ గ్రామం అభివృద్ధి చెందేలా అభివృద్ధి పనులు చేయిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా సీఎం జగనన్న పేరొందన్నారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ టి.దామోదరరావు, వైఎస్సార్ సీపీ నేతలు ఎస్.వేణుగోపాలనాయుడు, బి.సత్యనారాయణ, సర్పంచ్‌లు బి.పద్మ, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ
దివ్యాంగుల దినోత్సవం



రాజాం సిటీ: దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు, బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజాం సిటీ/వంగర: మండల కేంద్రాల్లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజాంలోని భవితకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్‌కుమార్ పాల్గొని, దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగుల్లోని ప్రతిభాపాటవాలను గుర్తించి, ప్రోత్సహిస్తే వారు కూడా అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు ట్యాబ్‌లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'లో సమస్యల పరిష్కారం



తెర్లాం: ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరావు

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎన్నో ప్రజాసమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు సమస్యల పరిష్కారానికి పలువురు గ్రామస్తులు సమర్పించిన దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించారు. అనంతరం సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందికి తెలిపారు.

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం దృష్టికి పలువురు తీసుకువచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. అనంతరం గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో చేపడుతున్న పనుల ప్రగతిపై సమీక్షించారు. జగనన్న కాలనీల్లో శతశాతం మేర నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, ఏపీవో సాయిరాం, ఏపీఎం అప్పలనాయుడు, జేఈలు ప్రభాకరరావు, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: జగనన్న కాలనీ లేఅవుట్లు, సొంత స్థలాల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహ నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన మండలంలో జరగనున్న సామూహిక గృహ ప్రవేశాల నాటికి ఇళ్లను సిద్ధం చేయాలన్నారు. 294 ఇళ్ల నిర్మాణాలను లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని, వీటిన్నింటినీ పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించి, అర్హులైన కులవృత్తుల వారు రుణాల కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. త్వరలో చేపట్టనున్న కుల గణనకు సంబంధించి, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, ప్రతీ సచివాలయ ఉద్యోగికి 100 ఇళ్ల సర్వేకు అప్పగించడం జరుగుతుందన్నారు. కొద్దిరోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

తుఫాన్.. అలెర్ట్..!



సంతకవిటి: ఎం.ఆర్.అగ్రహారంలో వరి కుప్పలు తడకుండా వాటిపై కప్పిన టార్పాలిన్లు

మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో అన్నదాతలు, అధికారులు అలెర్ట్ అయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇప్పుడు వాయుగుండంగా బలపడి తీవ్ర తుఫాన్‌గా మారిన క్రమంలో రోజంతా మబ్బులు, వర్షాలున్న పరిస్థితి. ఏ క్షణమైనా తుఫాన్ తీవ్రరూపం దాల్చవచ్చన్న ఉద్దేశ్యంతో రైతులు కష్టపడి పండించిన వరి పంటను ఎలాగైనా కాపాడుకోవాలని శ్రమిస్తున్నారు. కొంతమంది ఇప్పటికే వరికోతలు వాయిదా వేసుకోగా, మరికొంతమంది కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించి, భద్రపరుస్తున్నారు. ఇంకొంతమంది పొలాల్లోనే వరి కుప్పలు వేసి, అవి తడవకుండా టార్పాలిన్లు కప్పుతున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం కూడా రైతులు నష్టపోకుండా తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



బాడంగి: రేజేరులో వ్యాన్ ద్వారా రైస్‌మిల్లుకు ధాన్యం తరలిస్తున్న అధికారులు



బొబ్బిలి: అలజంగిలో యంత్ర సహాయంతో త్వరితగతిన వరి నూర్పు చేస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం





బాడంగి: పాల్తేరులో సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, రేగిడి: దేవుదళలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని వాడాడ, కోటిపల్లి, పాల్తేరు గ్రామాల్లో రూ.1.21 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ క్రమంలో వాడాడలో సచివాలయం, ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం) భవనాలు, కోటిపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం), వెల్‌నెస్ సెంటర్ భవనాలు, పాల్తేరులో సచివాలయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్న సదుద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. ఇప్పటికే ప్రతీ ఇంటికి మేలు జరిగేలా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మరోవైపు నుంచి అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క ప్రభుత్వ సేవ కావాలన్నా మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదన్నారు. ఉన్న ఊరిలోనే మనకు కావాల్సిన ప్రభుత్వ సేవలు సచివాలయాల ద్వారా లభ్యమవుతున్నాయన్నారు. ఇదే కాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో సరఫరా చేయడంతో పాటు సాగు సలహాలు, సూచనలు కూడా అందజేయడం జరుగుతోందన్నారు. అలాగే వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాలకే వైద్యసేవలు వచ్చేలా చేశారన్నారు. గతంలో ఉన్న టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించి, ప్రభుత్వం చేస్తున్న మంచిని అర్థం చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధరకే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా, ఆయా గ్రామాల ప్రజలు కొన్ని ప్రతిపాదనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత ఎస్.వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పి.రామారావు, వాడాడ సర్పంచ్ పి. తిరుపతమ్మ, కోటిపల్లి సర్పంచ్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ రఫీజాన్, ఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయ, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలిసి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతుండడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. అలాగే పథకాలు కూడా అర్హులకే అందుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం జగనన్న ధ్యేయమని, ఆయన ఆ దిశగా పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. మరింత అభివృద్ధి, సంక్షేమం కావాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.దుర్గమ్మ, మాజీ ఎంపీటీసీ కె.శ్రీహరిరావు, వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్మోహనరావు, ఎంపీడీవో శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



అంబలం పూజలో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో అయ్యప్పస్వామి భక్తులు సోమవారం అంబలం పూజ నిర్వహించారు. అరటి దవ్వలతో ఆలయం నిర్మించి, అయ్యప్పస్వామికి అభిషేకాలు చేశారు. వన్నలితో పాటు పరిసర గ్రామాల అయ్యప్పస్వాములు పెద్దఎత్తున ఈ పూజలో పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యాలయాల టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం మండల కేంద్రంలో జరిగింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పి.శ్రీనివాసరావు, అప్పారావు, కార్యనిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులుగా కె.భారతి, సతీష్, ఉపాధ్యక్షురాలిగా కె.సునీత, కోశాధికారిగా బి.శంకరరావు ఎంపికయ్యారు.

చురుగ్గా బోర్ల మరమ్మతులు



పనసలవలసలో బోరు బాగుచేస్తున్న మెకానిక్

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామంలో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు సోమవారం చేపట్టారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని ఇలాంటి బోర్లును బాగుచేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు. ఏ గ్రామంలోనైనా బోర్లు పని చేయకపోతే సచివాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పనసలవలస సర్పంచ్ గేదెల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.